దుర్గమగిరి కాంతార్
మరుదుస్తర్ పారావార్
లాంఘితె హెబ్‌రాత్రి నిషితె,
యాత్రిరా హోషియార్
దుర్గమాల అడవులు కొండలు ఎడారులు
దుస్తరాలు పారావారాలు
పథికులారా పారాహుషార్!
అర్థరాత్రి అంధకారంలో
అధిగమించాలి
పారాహుషార్!!
"చల్ చల్ చల్!
ఊర్ధ్వగగనే బాజెమాదల్!
నిమ్నే ఉతలా ధరణితల్
అరుణ్‌ప్రాతీర్
తరుణ్‌గళ్
చల్ చల్ చల్"
పదండి పదండి పదండి
అదిగో పిలుస్తోంది
పైన గగనాన
మద్దెల దరువు
కింద
ధరణీతలాన
వినవస్తోంది తాళం!
అరుణారుణ ప్రాత:కాలపు
నవయువకుల్లారా!
పదండర్రా పదండి! పదండి.

7-3-1934న నజ్రుల్ పెద్ద కొడుకు 'బుల్‌బుల్' మశూచి పోసి మరణించాడు. ఈ మూడున్నర సంవత్సరాల అసాధారణ తెలివితేటలు గల 'బుల్ బుల్' మరణం నజ్రుల్ జీవితంపైనా సాహిత్య రచన పైనా విశేషంగా మార్పు తెచ్చింది.

1942లో ఆయనకి మానసికమైన ఉన్మాదం వచ్చింది.

నజ్రుల్ మొత్తం 3500 పాటలు రాశాడని అంటారు. 3500 పాటలు కేవలం సంఖ్యా దృష్ట్యానేకాదు, వాటి వైవిధ్యం దృష్ట్యా కూడా ఆశ్చర్యం కలిగిస్తాయి. 'జుల్ఫికార్' రచన 1932నాటిది. దీనిలో మతాభిమానాన్ని, ఆధ్యాత్మికతని ఓ కొత్తరూపంలో చూపించింది. ఈ సంకలనంలోని పాటల్లో ఇస్లాం ప్రేరణ కనబడుతుంది. వీటి ఆకర్షణ తీవ్రమైనది, లోతైనది. ఈ పాటలు భక్తి ప్రధానమైనవి. స్పష్టత, గంభీరతా ఉన్న పాటలు. నజ్రుల్ పాటల వివరాలు ఏమీ ఉంచలేదు. వాటిని భద్రపరుచుకొనే ప్రయత్నమూ చేయలేదు.

నజ్రుల్‌కి ఓ ముస్లింగా ఇస్లాం విధానం బాగా తెలుసు. ఇస్లాం పట్ల గట్టి నమ్మకం వుండి, మత దురభిమానం లేని వారితో కలిసిపోయే అద్భుతమైన యోగ్యత నజ్రుల్‌లో వుంది.

9-7-1942న కలకత్తా రేడియో స్టేషన్ నుండి నజ్రుల్ ప్రసంగిస్తున్నాడు. కాని ఆకస్మికంగా ఆయన గొంతు పడిపోయింది. ఆయనని ఇంటికి తీసుకొచ్చే సమయానికి మానసికమైన యోగ్యతలన్నీ పోయాయి.

భారత రాష్ట్రపతి నజ్రుల్‌కి పద్మభూషణ్ అవార్డుతో సత్కరించారు. కలకత్తా విశ్వవిద్యాలయం 'జగత్తారిణి' బంగారు పతకంతో సత్కరించింది. 1969లో కలకత్తా కార్పోరేషన్ డండం విమానాశ్రయం నుంచి నగరం వైపు మార్గానికి నజ్రుల్ ఇస్లాం పేరు పెట్టింది.

నజ్రుల్ జీవితకాలంలోని చివరి 30సం॥లు ప్రపంచానికి మృత్యువు క్రిందేలెక్క. దుర్దమశక్తి సంపన్నుడైన నజ్రుల్ విధి, విలాసం వలన ఆ 30 సం॥లు పాటు ఘోరమైన చిత్తవైఫల్యాన్ని అనుభవించాడు. భయంకరమైన ఆ వ్యాకుల పాటుకూ, పైబడి వచ్చి ఆ మూగతనానికీ ఎడతెరపి లేకుండాపోయింది.

30 సంవత్సరాల అవిశ్రాంత మానసిక దుస్థితి నుండి 1976లో మరణించాక శాశ్వత విశ్రాంతి తీసుకున్నాడు జాతీయకవి నజ్రుల్ ఇస్లాం.

❖ ❖ ❖

# తెలుగు తల్లి భాష కూడా దేవభాషే

**నూర్ బాషా రహంతుల్లా**

1-8-2006 నుండి తమిళనాడులో కొన్ని సంస్కరణలకు ముఖ్యమంత్రి కరుణానిధి శ్రీకారం చుట్టారు. అందులో తమిళభాషకు ప్రాణం పోసే సంస్కరణలు కొన్ని ఉన్నాయి.:

1. అన్ని స్కూళ్ళల్లో తమిళభాష నేర్పటం నిర్బంధం చేశారు.
   ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలలనే తేడాలేదు. ఇంగ్లీషు మీడియం స్కూళ్ళయినా సరే తమిళం నేర్పాల్సిందే.
2. కామరాజు పుట్టి రోజును "విద్యాభివృద్ధి దినోత్సవం"గా జరుపుతారు.
3. తమిళపేర్లు పెట్టిన సినిమాలకు ప్రోత్సాహకాలిస్తారు.
4. అన్ని కులాల ప్రజలూ 'అర్చకులు' అవుతారు.

కేవలం బ్రాహ్మణులు మాత్రమే గాక ఏ కులం వ్యక్తి అయినా గుడిలో పూజారి కావొచ్చు. పైగా సంస్కృత మంత్రాల స్థానంలో తమిళ మంత్రాలు, ప్రార్థనలు చదవొచ్చు. ఒక పక్క బడుగు కులాల వాళ్ళకు అర్చక పదవుల వల్ల సాంఘిక గౌరవం దక్కుతూ, మరో పక్క వెనుకబడిన కులాలు రక్షించుకుంటూ వస్తున్న తమిళం దేవభాషగా విరాజిల్లుతుంది. ఉభయతారక మంత్రం ఇది.

పై సంస్కరణలు మన రాష్ట్రంలో కూడా త్వరలో రావాలని ఆశిద్దాం. తెలుగు ప్రజల కంటే తమిళుల జన సంఖ్య తక్కువే. అయినా తమిళులకు చేవ ఎక్కువ. తమిళాన్ని దేవభాషగా గౌరవిస్తారు. మన తెలుగు కూడా దేవభాషే అని చాటిచెబుదాం. తెలుగును దేవభాషగా గౌరవిద్దాం. ఇందులో తప్పేంలేదు. ఇంగ్లీషు, సంస్కృతం, అరబీ భాషలను మనం గౌరవించటం లేదా? అలాగే మన భాషను కూడా గౌరవిద్దాం.